క్లుప్తంగా

నరేంద్రపురంలో స్కిల్ హబ్ ప్రారంభం



నరేంద్రపురం గురుకుల పాఠశాలలో ప్రారంభించిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సెంటర్

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురం గురుకుల పాఠశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి.లోకమాన్ విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాలలో మంగళవారం ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత శిక్షణ పొందిన అనంతరం ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో 30 మందికి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించినట్టు ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర వెంకమాంబ, ఎంపీటీసీ కొక్కిరి వెంకటలక్ష్మి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.వేణు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శాస్త్రి, ఏడీఎస్‌డీఓ ఒ.నాగబాబు, స్కిల్ ప్రోగ్రాం ట్రైనర్ కె.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి చేరిన అంగన్‌వాడీలు, హెల్పర్లు

అంబాజీపేట: మండలంలోని ఐసీడీఎస్ పరిధిలో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సోమవారం సమ్మె విరమించి మంగళవారం నుంచి తమ విధుల్లో చేరినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీఎస్‌వీ మహాలక్ష్మి తెలిపారు. అంబాజీపేట హడ్కోకాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. పలువురు అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ విధులకు హాజరు కాని అంగన్‌వాడీలు, సహాయకులపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడంతో విధుల్లో చేరినట్లు చెప్పారు. అంగన్‌వాడీల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగానే ఉందని వేతన పెంపునకు ప్రభుత్వం కొంత గడువు కోరిందని, అది సహేతుకమే అన్నారు.

కులగణన పక్కాగా చేపట్టాలి

అంబాజీపేట: కులగణన పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.సత్యనారాయణమూర్తి సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు ఆదేశించారు. ముక్కామల, పసుపల్లి, గంగలకుర్రు తదితర గ్రామాల్లో జరుగుతున్న కులగణన సర్వేను మంగళవారం పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును ఎంపీడీవో పరిశీలించి పలు సూచనలు చేశారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి ఇంటి యజమానులు పూర్తి వివరాలు చెప్పి సహకరించాలని ఆయన కోరారు.

చురుగ్గా కులగణన సర్వే

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బీసీ కులగణన సర్వే చురుగ్గా సర్వే జరుగుతుంది. మండల రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సమగ్రంగా సర్వే వివరాలను నమోదు చేసుకుంటున్నారు. మరో రెండు రోజుల్లో కులగణన సర్వే పూర్తి చేయనున్నట్లు తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ పేర్కొన్నారు.

విద్యకు జగన్ సర్కార్ ప్రాధాన్యం

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ పేర్కొన్నారు. అప్పనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు 31 మందికి మంగళవారం ప్రభుత్వం ఉచితంగా అందించిన ట్యాబ్‌లను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం బి.సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగిన సభలో మధ్యాహ్న భోజన పథకం వంటి సామగ్రినికి కూడా ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు అందించారు. కార్యక్రమంలో తులా గోపాలకృష్ణ, కంకిపాటి వెంకటేశ్వరరావు, బత్తుల జనార్దనరావు, తులా నాగరాజు, గెద్దం వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశు సంపదను పెంపొందించుకోవాలి

పి.గన్నవరం: పశుసంపదను పెంపొందించుకుని అదనపు ఆదాయం పొందాలని పశు సంవర్థక శాఖ ఉప సంచాలకుడు కర్నీడి ఎస్‌వీవీఎస్ మూర్తి పాడి రైతులకు విజ్ఞప్తి చేశారు. జి.పెదపూడిలంకలో మంగళవారం జరిగిన ×పశు విజ్ఞాన బడి× కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏడాదికో దూడ అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. 70 పశువులకు చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్టు మండల పశు వైద్యాధికారి కిరణ్ చైతన్య తెలిపారు. కార్యక్రమాల్లో పశు వైద్య సహాయ సంచాలకుడు ఎల్.విజయారెడ్డి, సర్పంచ్ దంగేటి అన్నవరం, వెంకటపతిరాజు, జి.భగవాన్‌రావు, పశు సంవర్థక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

మలికిపురం: జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం తయారు చేసిన టెన్త్ క్లాస్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన తెలుగు, ఇంగ్లీష్ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించారు. పుస్తక రూపంలో పొందుపరిచి మెటీరియల్‌ను మంగళవారం ఏఎఫ్‌డీటీ హైస్కూల్ మలికిపురం విద్యార్థులకు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్షులు గుబ్బల తులసీరామ్, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, ఏఎఫ్‌డీటీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరా.. మహిళలకు భరోసా

- రూ.16.24 కోట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి
- సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన ఎమ్మెల్యే, మహిళలు



కొత్తూరులో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



కొత్తూరులో సీఎం జగన్ చిత్రపటానికి ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి చేతుల మీదుగా క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

ఆలమూరు: రాష్ట్రంలోని మహిళలందరికీ ఆర్థిక భరోసా కల్పించేందుకు గత సార్వత్రిక ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా వైఎస్సార్ ఆసరా పథకం కింద నియోజకవర్గానికి నాలుగు విడతలుగా రూ.219.60 కోట్లు పంపిణీ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్‌లోని ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, పీఏసీఎస్ చైర్మన్లు నెక్కంటి వెంకట్రాయుడు, మోటుపల్లి వెంకన్న, ఏజీపీ నామాల శ్రీనివాసుల ఆధ్వర్యంలో మంగళవారం నాలుగోవిడత వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.16.24 కోట్లు రుణమాఫీ మంజూరు పత్రాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించగా ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మహిళల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సీఎం జగన్ మహిళా పక్షపాతిగా నిలిచారన్నారు. నాటి టీడీపీ పాలనలో అన్నిరంగాల్లో దగా పడిన మహిళలను అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే మండలంలోని 1652 డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతలుగా రూ 60.08 కోట్లు పంపిణీ చేసిన విషయాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గుర్తు చేశారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రకటించారు. అనంతరం వైఎస్సార్ ఆసరా పథకం కింద మండలంలో తొలుత ఆరు గ్రామాలకు సంబంధించి రూ.2.84 కోట్లు ఆయన పంపిణీ చేశారు. ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఏపీఎం ఎం.ధనరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు. సభా ప్రాంగణంలో ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి చేతుల మీదుగా సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం నిర్వహించారు. మహిళలకు ఆర్థికస్వావలంభన సాధించేందుకు విశేషంగా తోడ్పాటును అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి రాబోయే ఎన్నికల్లో అండగా ఉంటామని ప్రతినబూనారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు వాసంశెట్టి దుర్గాభవాని, నేలపూడి రత్నకుమారి, రాష్ట్ర యూత్ ప్రధాన కార్యదర్శి దియ్యన పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ ఆరోగ్యం



మేడిచర్లపాలెంలో ఆరోగ్య సురక్ష కార్డులను అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు



ముక్కామలలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి

ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలం మేడిచర్లపాలెంలో మంగళవారం రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాపాక ప్రారంభించారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఖరీదైన వైద్యం పేదల ముంగిట నిలిచిందని, ప్రజనలకు ఏ చింతా లేకుండా సీఎంఆరోగ్యశ్రీ పథకంలో అన్ని రోగాలకు ఉచిత వైద్యం అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడిచర్ల వల్లీశ్వరి, ఎంపీటీసీ ముత్యాల సాయిరామ్, ఎంపీడీఓ ముత్యం వీరాస్వామినాయుడు, కానూరి బాబి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సురక్ష

అంబాజీపేట: పేదల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఎంతో భరోసాగా నిలుస్తుందని జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. ముక్కామల సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. జెడ్పీటీసీ వరలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో మంచి సంకల్పంతో పేదలకు ఉచితంగా వైద్యాన్ని అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. సురక్ష మెడికల్ క్యాంపులో వైద్య సిబ్బంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వనచర్ల కనకదుర్గ, బండారు మల్లిబాబు, పీహెచ్‌సీ వైద్యుడు ఎం.రవికుమార్, హెల్త్ సూపర్‌వైజర్ ఎ.రాధానరసింహం, హెల్త్ అసిస్టెంట్ ప్రసాద్‌బాబు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళలకు కుక్కర్ల పంపిణీ



కొత్తూరు సెంటర్‌లో మహిళలకు కుక్కర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో కుక్కర్ల పంపిణీ జరిగింది. స్థానిక కొత్తూరు సెంటర్‌లోని ఎస్‌జేఆర్ కల్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా పథకం పంపిణీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆ సభకు బారీ స్థాయిలో హాజరైన మహిళలకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి లక్కీ డిప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కుటుంసభ్యుల చేతుల మీదుగా విజేతలైన 50 మందికి కుక్కర్లను అందజేశారు. సంక్షేమ పథకాల్లో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకపోతే సత్వరమే సంబంధిత అధికారులను సంప్రదించాలని మహిళలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు సీఎం జగన్ వల్లే సాధ్యమవుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధికి, సంక్షేమానికి పట్టం కావాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తమ సోదరీమణులు శైలజ, నాగజ, సతీమణి లావణ్య చేతుల మీదుగా సుమారు ఐదు వేల మందికి భోజన వసతిని ఏర్పాటు చేశారు.

రామనామ సంకీర్తనకర్త శేఖర్‌కు ఘనసన్మానం



శేఖర్‌ను సత్కరిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

కొత్తపేట: గ్రామాల్లో శ్రీరామనామ సంకీర్తన ద్వారా హిందూమత ప్రచారం చేస్తున్న దర్శాల శేఖర్‌ను పలు ధార్మిక సేవా సంస్థలు ఘనంగా సత్కరించాయి. కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన శేఖర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీరాముని భక్తుడైన శేఖర్ గత కొన్నేళ్లుగా తన ఆటో ద్వారా శ్రీరామనామ సంకీర్తన ప్రచారం చేస్తున్నారు. తన ఆటోకు శ్రీరాముని చిత్రంతో కాషాయ పతాకాలను అలంకరించి, మైకు తగిలించి తెల్లవారుజామునే పురవీధుల్లో తిరుగుతూ రామనామ సంకీర్తనల ద్వారా ప్రజలను మేల్కొలుపుతున్నారు. తరువాత 8 గంటల అనంతరం తన జీవనాధారమైన ఆటో సరీ్వసు చేసుకుంటారు. ఈ విధంగా ఆయన హిందూ మత ప్రచారం చేస్తూ, దైవ సేవలో తరిస్తూ భక్తుల అభిమానాన్ని చూరగొన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయిబాబా మందిరంలో సోమవారం రాత్రి సన్మానం నిర్వహించారు. సంస్థ కన్వీనర్ కంకటాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన శేఖర్ సన్మానంలో వ్యాపారవేత్త నంభూరి రెడ్డియ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం శేఖర్‌ను శాలువా, పూలమాలలు, నూతన వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుతాపల్లి లక్ష్మీనారాయణ, కొత్తమాసు సాంబశివరావు, చొప్పెల్ల రాంబాబు, సత్యవరపు భాస్కరరావు, మారిశెట్టి సత్యనారాయణ, చింతం రామకృష్ణ, కోట్ల విజయసారధి, బ్రహ్మరాజు తదితరుల ఆధ్వర్యంలో శేఖర్‌ను ఘనంగా సత్కరించారు.

రహదారుల అభివృద్ధే లక్ష్యం



జయంతినగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్, ఇన్‌చార్జి వేణుగోపాలరావు

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో మారుమూల ఉన్న ప్రధాన రహదారుల అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మాచవరం పంచాయతీ పరిధిలోని సీసీ రోడు నిర్మాణం, ప్రారంభోత్సవాలను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ మాచవరం దొమ్మేటివారిపాలెం వద్ద జెడ్పీ నిధులు రూ.8 లక్షలతో సీసీ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. అలాగే జయంతినగర్‌లో జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించామన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న ప్రధాన రహదారులకు మోక్షం కలిగిందన్నారు. ప్రజా సంక్షేమం కోసమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి గెలిపించి సీఎంని చేయాలని వేణుగోపాలరావు కోరారు. అనంతరం అంబాజీపేట పశువులాస్పత్రి ఎదురుగా ఉన్న సత్యసాయి నగర్‌లో రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని జెడ్పీ చైర్మన్‌ను స్థానికులు కోరుతూ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీలు మట్టా పార్వతి, మైలా నాగలక్ష్మి, ముత్తాబత్తుల ప్రశాంత్, ఉందుర్తి నాగబాబు, మైలా ఆనందరావు, కొర్లపాటి కోటబాబు, కోట సత్తిబాబు, మట్టపర్తి హరి, సూదాబత్తుల రాము తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన బాలికకు రూ. 20 వేల ఆర్థిక సాయం



పాప వైద్యానికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కింద పడి తలకు గాయం కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏడేళ్ల బాలికకు మంగళవారం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవాసంస్థ సభ్యులు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన ఈతకోట వెన్నెల, ఈ నెల 19న ఆడుకుంటుండగా కింద పడి తలకి గాయమైంది. పేదరికంతో బాధపడుతున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకువెళ్లటానికి డబ్బులు లేని పరిస్థితి. దీంతో చుట్టుపక్కల వాళ్లు డబ్బులు వేసుకుని అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. పాప తలకి లోపల బ్లీడింగ్ అవుతుందని వైద్యులు చెప్పడారు. దీంతో వైద్యం కోసం సాయం చేయని స్థానిక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను కోరగా పాప సమీప బంధువు రమణకి రూ.20 వేలు నగదు సాయాన్ని సేవా సంస్థ సభ్యులు అందజేశారు.

ఘనంగా నేతాజీ జయంతి



నగరం స్కూల్‌లో నేతాజీకి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మామిడికుదురు: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి మంగళవారం ఘనంగా జరిగింది. నగరం ముస్లిం వీధిలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, చిన్నారులు నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. చిన్నారులు నేతాజీ జీవిత చరిత్రను వివరించి అబ్బురపర్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జకీరున్నీసా బేగం, మాగాపు విజయదుర్గారావు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలోని పోతవరం ప్రాథమిక పాఠశాల వద్ద హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో మంగళవారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహిచారు. ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.మల్లికార్జునరావు, ఎండీ ఇస్మాయిల్, పీహెచ్‌బీ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



మాచవరంలో వెన్నెల తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

అంబాజీపేట: మాచవరం శివారు సరెళ్లవారిపేటకు చెందిన ఈతకోట వెన్నెల వైద్యానికి పలువురు ఆర్థిక సాయాన్ని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. వెన్నెల ప్రమాదవశాత్తూ పడిపోవడంతో తలకు తీవ్రగాయమైందని, చిన్నారి వైద్యానికి దాతలు సహకరించాలంటూ పేబ్యాక్‌టు సొసైటీ ఆర్గనైజేషన్ ద్వారా వాట్సాప్‌లో సమాచారం ఇచ్చారు. రావులపాలేనికి చెందిన కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి రూ.20 వేలు, అంబాజీపేట నాగాబత్తుల సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ రూ.5 వేలు, ఇసుకపూడికి చెందిన నక్కా ఏడుకొండలు రూ.4 వేలు నగదుతో పాటు ఇతరుల నుంచి వచ్చిన ఆర్థిక సాయాన్ని బాలిక తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో బొంతు పెదబాబు, నాగాబత్తుల సుబ్బారావు, నాగాబత్తుల వెంకటపతి, పులిదిండి వీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

మహా శివునికి ప్రత్యేక పూజలు



భీమనపల్లిలో ప్రత్యేక అలంకరణలో అనంగేశ్వరస్వామి

ఉప్పలగుప్తం: భీమనపల్లి గ్రామంలో అనంగేశ్వర స్వామివారి దేవస్థానంలో మంగళవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ కె.కార్తీక, వరదా శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు వెలువలపల్లి వెంకటసూర్య సత్యనారాయణశర్మ ఉదయం నుంచి గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, మహాశివునికి రుద్ర హోమం నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలకరించి, అన్నసమారాధన చేశారు.

ఘనంగా రుద్ర హోమం

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం ఘనంగా జరిగింది. పరమ శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని ఆలయంలో మంగళవారం అర్చకస్వామి పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులు స్వామివారికి గణపతి పూజ, మండపారాధన, రుద్రహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు.

మిగులు బడ్జెట్ రూ.27500



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి

అయినవిల్లి: మండల బడ్జెట్ సమావేశం మంగళవారం ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అన్ని పద్దులు కలిపి ఆదాయం 2024–25 సంవత్సరానికి గాను రూ.68,054,7000 కాగా ఇదే సంవత్సరానికి రూ.68,051,9500 అన్ని పద్దులు వ్యయంగా చూపించారు. మిగులు బడ్జెట్ రూ.27,500 చూపించారు. ఈ బడ్జెట్‌ను ఆమోదిస్తూ సభ్యులు తమ అంగీకారాన్ని తెలిపారు. అనంతరం సమావేశంలో వివిధ శాఖలతో సమీక్ష నిర్వహించారు. మండల సర్వసభ్య సమావేశానికి శాఖ పరమైన బాధ్యతలు తీసుకున్న ఉన్నత అధికారులు కాకుండా దిగువ స్థాయి అధికారులను పంపించడంపై సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. దీని వల్ల శాఖా పరమైన అభివృద్ధి తమకు తెలియకపోవడమే కాకుండా శాఖా పరమైన సమస్యల పరిష్కారం జరగడం లేదని ఆరోపించారు. మండల సర్వసభ్య సమావేశం మూడు నెలలకోసారి జరిగే సమావేశమని ఈ సమావేశానికి శాఖపరంగా ఆ శాఖకు సంబంధించి మండల స్థాయి, డివిజన్ స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరై తాము గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారమయ్యేలా చేయాలని కోరారు. అలా కాకుండా సమావేశాలకు హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల సమావేశంలోని అధికారులను డిమాండ్ చేశారు. ఇకపై అలా జరక్కుండా చూడాలన్నారు. వ్యవసాయశాఖ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలపై సమీక్షించారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని చేసి ఆయనకు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. సమావేశంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.సత్యనారాయణ, ఈఓపీఆర్డీ మోహన్‌కృష్ణ, డీటీ అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ ఆర్థిక సాయం



కేశవదాసుపాలెంలో సాయం అందిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు అన్నపూర్ణ

సఖినేటిపల్లి: నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు ఇరువురికి రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని స్థానిక జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ మంగళవారం అందజేశారు. సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెంకు చెందిన అడబాల నీలవేణి, రాజోలు మండలం తాటిపాకకు చెందిన అరుణ్‌కుమార్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీనిని స్నేహితుల ద్వారా తెలుసుకున్న వైఎస్సార్ సీపీ ఖతార్ కన్వీనర్ దొండపాటి శశికిరణ్ బాధితులు ఇరువురికి కలిపి రూ.10 వేలు పంపారు. ఈ మొత్తాన్ని శశికిరణ్ తల్లి, జెడ్పీటీసీ అన్నపూర్ణ చేతుల మీదుగా వారికి రూ.5 వేలు చొప్పున అందజేశారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, నాయకులు వై.చిట్టిబాబు, కె.చిట్టిబాబు, జి.సత్యనారాయణ, డి.బాలాజీ, ఓ.విజయరత్నం, కె.లాజరు పాల్గొన్నారు.

కవిబంధు పురస్కార గ్రహీత విక్రమ్‌కు సన్మానం



విక్రమ్‌ను సన్మానిస్తున్న వృత్తి కళాకారుల సంఘం ప్రతినిధులు

మామిడికుదురు: కవిబంధు పురస్కార గ్రహీత డాక్టర్ పాలమూరి విక్రమ్‌ను కోనసీమ వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం మంగళవారం ఘనంగా సత్కరించింది. ఇటీవల ఒంగోలులో లిటిల్ చాంప్స్ అకాడమీ ద్వారా విక్రమ్ కవిబంధు అవార్డు అందుకున్న నేపథ్యంలో విక్రమ్‌కు జ్ఞాపక అందించి శాలువాతో సత్కరించారు. సాహిత్య రచనల ద్వారా, సాంస్కృతిక సేవా కార్యక్రమాల ద్వారా విక్రమ్ ఎంతో కృషి చేస్తున్నారని సంఘం కార్యదర్శి వాసంశెట్టి శంకరరావు, అధ్యక్షుడు మంగం సత్యనారాయణ పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి అడబాల వెంకటస్వామినాయుడు, చిట్టూరి దాశరధి, కుడుపూడి అర్జునరావు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్‌తో ఇంటింటికీ తాగునీరు

మామిడికుదురు: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులతో ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ పేర్కొన్నారు. వికసిత భారత్ సంకల్పయాత్రలో భాగంగా మంగళవారం పెదపట్నంలంక, మామిడికుదురు, మగటపల్లి గ్రామాల్లో జరిగిన సభలకు నోడల్ అధికారి, ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సభలో బీజేపీ నేతలు మాట్లాడారు. జల్‌జీవన్ మిషన్, నారీశక్తి వందన్, ఉజ్వల, విశ్వకర్మ యోజన, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలను కేంద్రం అమలు చేస్తుందన్నారు. సర్పంచ్‌లు సుందరనీడి చిన్ని, గౌస్ మొహిద్దీన్, సూరిశెట్టి లక్ష్మి, పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ, నేతలు కంకిపాటి సుబ్బారావు, గాడి సత్తిబాబు, నక్కా త్రిలోచనరావు తదితరులు పాల్గొన్నారు.